క్లుప్తంగా

ఉరుకుంద ఆలయంలో జోరుగా పనులు



ఉత్తర ద్వారంలో బండలు పరుస్తున్న కూలీలు

కౌతాళం: ఉరుకుంద ఈరన్నస్వామి ఆలయ ఆవరణలో అభివృద్ధి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా రూ.1.28 కోట్లతో జరుగుతున్న బండపరుపు పనుల కోసం మహాప్రాకారంలోని లోపలి భాగంలో నాలుగు వైపులా పనులు చేపట్టారు. పనులు శ్రావణమాసంకు ముందే ప్రారంభమైనప్పటికీ ఉత్సవాల సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందుల కలగకుండా చూడలని పనులను కొన్ని రోజుల పాటు నిలిపివేశామని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వాణి, ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ నాగరాజ్‌గౌడ్ తెలిపారు. ఉత్సవాలు ముగిసిన అనంతరం పనులను ముమ్మరం చేసినట్లు గురువారం చెప్పారు. ఈ పనులు ప్రస్తుతం చివరి దశలో ఉన్నాయని అలాగే మహాప్రాకారం పనులు కూడా చివరి దశకు చేరాయన్నారు.

ఖాదర్‌లింగస్వామి దర్గాలో ప్రత్యేక ఫాతెహాలు



పూజలందుకున్న ఖాదర్‌లింగస్వామి

కౌతాళం: మండల కేంద్రంలో వెలసిన జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాకు గురువారం భక్తులు అధికంగా తరలివచ్చి భక్తి శ్రద్ధలతో ఫాతెహాలు సమర్పించారు. భక్తుల రాకతో దర్గా పరిసరాలు సందడిగా మారాయి. తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్టీ, పీఠాధిపతి ఖాదర్ బాష చిష్టీ స్వామి సమాధికి గంధం పూసి ప్రత్యేక ఫాతెహాలు చేపట్టారు. భక్తులు పిండి వంటలు వండి స్వామికి నైవేద్యంగా సమర్పించారు.

90శాతం పింఛన్ల పంపిణీ



ఎరిగేరలో దివ్యాంగురాలు పూజారి ఎల్లమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ మూకెన్న

కౌతాళం : మండలంలో గురువారం నాటికి 90 శాతం పింఛన్‌లు పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ సుబ్బరాజు తెలిపారు. ఆయన మాట్లాడుతూ మండలంలో 8,819 పింఛన్‌దారులు ఉండగా ఇప్పటి వరకు 7,952 మందికి పింఛన్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఉప్పరహాల్ గ్రామానికి చెందిన వృద్ధురాలు లక్ష్మమ్మకు ఆదోని హాస్పిటల్‌లో చికిత్స పొందుతుండగా వలంటీర్ రాఘవేంద్ర ఆదోనికి వెళ్లి పింఛన్ అందించారని చెప్పారు. రెండు రోజుల్లో వంద శాతం పింఛన్ల పంపిణీ పూర్తి చేస్తామని పేర్కొన్నారు.

రక్తదానం



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

ఆదోనిరూరల్ : ఆదోని–ఆలూరు రహదారిలోని భీమా ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ బాలాజీ, కళాశాల సెక్రటరీ పి.ఎన్.విష్ణువర్ధన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ జి.ఎస్.సురేంద్రబాబు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఆపద సమయాల్లో ఉన్న వారికి మన రక్తం ఎంతగానో ఉపయోగపడుతుందని, రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని పిలుపునిచ్చారు.

కలిసిమెలసి జీవించండి



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ వేణుగోపాల్‌రాజు

మంత్రాలయం : గ్రామంలో ప్రజలంతా కలిసిమెలసి జీవించాలని ఎస్‌ఐ వేణుగోపాల్ రాజు సూచించారు. మండలంలోని చెట్నెహళ్లి గ్రామంలో గురువారం పోలీసులు పల్లెనిద్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ గ్రామస్తులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలో అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తుంటే తమ దృష్టికి తీసుకురావాలని, సమాచారమిచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. ముఖ్యంగా తల్లిదండ్రులు బడిఈడు పిల్లలను చదవించాలని కోరారు. విద్యతోనే ప్రతి ఒక్కరి భవిష్యత్ బాగుంటుందని చెప్పారు.

ప్రతిభాన్వేషణకు కౌశల్ పోటీలు

- రిజిస్ట్రేషన్‌కు 5వ తేదీ వరకు గడువు
- 21,22,23 తేదీల్లో ప్రాథమిక స్థాయి పరీక్షలు



ఆదోనిలో పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు

ఆదోని సెంట్రల్: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు కౌశల్ ప్రతిభాన్వేషణ పోటీలను నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు భారతీయ విజ్ఞాన మండలి, ఆంధ్రప్రదేశ్ సాంకేతిక మండలి సంయుక్తంగా పరీక్షలను ఏటా నిర్వహిస్తున్నారు. కౌశల్ క్విజ్, పోస్టర్ ప్రజెంటేషన్ పోటీల్లో పాల్గొనదలచిన విద్యార్థులు వ్యక్తిగతంగా, లేదా ఉపాధ్యాయుల సహాయంతో ఈ నెల 5వ తేదీలోపు బీబీబీ. ఛిర్ఘుఇ౯ాటజ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోలి. ముఖ్యంగా ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న 8,9,10 తరగతులకు చెందిన విద్యార్థులు పోటీల్లో పాల్గొనవచ్చును.

పరీక్ష విధానం..

రెండు విభాగాల్లో కౌశల్ పోటీలను నిర్వహిస్తారు. క్విజ్ పోటీలను 8,9,10 తరగతులకు ఆన్‌లైన్‌లో నిర్వహిస్తారు. పోస్టర్ ప్రజెంటేషన్ పోటీల్లో ఒక పాఠశాల నుంచి 8,9 తరగతులు చదువుతున్న ఇద్దరు విద్యార్థులకు అవకాశమిస్తారు. విజ్ఞనశాస్త్ర రంగంలో భారతీయుల కృషి అనే అంశంపై పోస్టర్ కాంపిటీషన్ జనరల్ థీమ్‌తో క్విజ్ పోటీలు ఉంటాయి. ఈ పోటీలకు రిజిష్టర్ చేసుకున్న వారికి ఈ నెల 21,22,23 తేదీల్లో ఆన్‌లైన్‌లో ప్రాథమిక స్థాయి పరీక్ష నిర్వహిస్తారు. ప్రతిభ కనపరిచిన విద్యార్థులను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేస్తారు. జిల్లా స్థాయి పోటీలు డిసెంబర్ 8వ తేదీ నిర్వహిస్తారు. అదే నెల 29,30 తేదీల్లో రాష్ట్ర స్థాయి పోటీలు ఉంటాయి. రాష్ట్రస్థాయి విజేతలకు గవర్నర్ చేతుల మీదుగా బహుమతులు అందజేస్తారు.

ప్రోత్సాహకాలు ఇలా..

క్విజ్, పోస్టర్ ప్రజెంటేషన్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులకు సర్టిఫికెట్లతో పాటు జ్ఞాపిక, నగదు బహుమతులను అందించనున్నారు.

- జిల్లా స్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి వరుసగా.. రూ.7500, రూ.6వేలు, రూ.4,500 ఇవ్వనున్నారు.
- రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన వారికి రూ.15వేలు, ద్వితీయస్థానం రూ.12వేలు, తృతీయ స్థానం రూ.9వేలు ప్రదానం చేస్తారు.
- పోస్టర్ ప్రజెంటేషన్ జిల్లా స్థాయి పోటీల్లో విజేతకు రూ.3వేలు, రెండో స్థానంలో నిలిచిన వారికి రూ.2వేలు, తృతీయ విజేతకు రూ.వెయ్యి చొప్పున అందిస్తారు.
- రాష్ట్ర స్థాయి పోటీల్లో విజేతలకు వరుసగా రూ.5వేలు, రూ.3వేలు, రూ.2వేలు అందించనున్నారు.

విద్యార్థులను భాగస్వాములను చేస్తాం



కౌశల్ పోటీల్లో విద్యార్థులను భాగస్వాములను చేస్తాం. పోటీల్లో పాల్గొనడం వల్ల పరీక్షలపై అవగాహన కలుగుతుంది. సైన్స్, మ్యాథ్స్‌పై కూడా పట్టు సాధించడానికి అవకాశం ఉంది. ఈ పరీక్షల ద్వారా విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించవచ్చు. ప్రస్తు పోటీ ప్రపంచంలో శాస్త్ర సాంకేతిక రంగాలపై కూడా ప్రతి విద్యార్థి అవగాహన కలిగి ఉండాలి.

– ఇందిరా ప్రియాంక, సైన్సు ఉపాధ్యాయిని

రిజిస్ట్రేషన్ చేయించండి



కౌశల్ పోటీలకు విద్యార్థులను సిద్ధం చేయడంతో పాటు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేయించాలి. 8,9,10 తరగతులకు చెందిన విద్యార్థులను గుర్తించి గణితం సైన్సు ఉపాధ్యాయులు చొరువ తీసుకోవాలి. ఈ పరీక్షల్లో పాల్గొనడం వలన విద్యార్థులకు పోటీ పరీక్షలు, ఆయా అంశాలపై అవగాహన పెరుగుతుంది. గెలుపొందిన విద్యార్థులు నగదు ప్రోత్సాహకాలతో పాటు సర్టిఫికెట్, జ్ఞాపికలను అందజేస్తారు. ప్రతి పాఠశాల నుంచి విద్యార్థులు పాల్గొనేలా ప్రధానోపాధ్యాయులు చర్యలు చేపట్టాలి.

– బి. శివరాములు, ఎంఈఓ

5న ఉచిత కంటి ఆపరేషన్లు

ఆదోనిఅర్బన్ : ఆరోగ్యశ్రీ సౌజన్యంతో జిల్లా ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో ఈనెల 5వ తేదీన ఉచిత కంటి ఆపరేషన్లను నిర్వహిస్తున్నట్లు సంఘం మాజీ అధ్యక్షుడు నగేష్ కాకుబాళ్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఆపరేషన్లతో పాటు ఆస్పత్రిలో వసతి భోజనాలు, ఆదోని నుంచి నంద్యాల ఆస్పత్రికి రానుపోనూ బస్సు సౌకర్యం కూడా కల్పిస్తున్నట్లు చెప్పారు. అనంతరం కరపత్రాలు విడుదల చేశారు. సంఘం నాయకులు మిర్యాల బద్రీనాథ్, శ్రీనివాస్, రఘు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి

కోసిగి: ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని కోరుతూ ఈనెల 11వ తేదీన హైదరబాద్‌లో చేపట్టిన మాది ఉప కులాల విశ్వరూపం మహాసభలను జయప్రదం చేయాలని ఎంఆర్‌పీఎస్ మండల అధ్యక్షుడు చింతకుంట సామేల్, ఎంఎస్‌పీ జిల్లా కో కన్వీనర్ దుర్గప్ప మాదిగ కోరారు. గురువారం మండల కేంద్రంలో కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ ఈనెల 11న హైదరబాద్ పరేడ్ గ్రౌండ్‌లో మాదిగ ఉప కులాల విశ్వరూప మహాసభను ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో జరుగుతుందని, కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ముఖ్య అతిథులుగా హాజరు కానున్నట్లు తెలిపారు. మహాసభకు అత్యధికంగా తరలి వెళ్లాలని పిలుపునిచ్చారు. మండల కోకన్వీనర్ ఎస్.ఈరన్న, నరసింహులు, గ్రామ నాయకులు రంగన్న, ప్రకాష్ పాల్గొన్నారు.

బాల్యవివాహాల నిర్మూలనే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర అభిషేక్‌కుమార్

ఆదోనిరూరల్ : ఆదోని డివిజన్‌లో బాల్యవివాహాలను నిరోధించేందుకు ముమ్మరంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సబ్‌కలెక్టర్ అభిషేక్ కుమార్ అధికారులను ఆదేశించారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలోని సమావేశపు హాలులో బాల్యవివాహాల నివారణపై డివిజన్, మండల సమన్వయ కమిటీ సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామ, వార్డు స్థాయి నుంచి అన్ని ప్రభుత్వశాఖల అధికారులందరూ బాల్యవివాహాలు నిరోధించేందుకు కృషి చేయాలని సూచించారు. చదువుకోని తల్లిదండ్రులు, పేదలు ఆర్థికంగా వెనకబడిన కుటుంబాలు బాల్యవివాహాల పట్ల మొగ్గు చూపుతున్నారన్నారు. ఈ పరిస్థితులను నియంత్రించేందుకు స్వయం సహాయక మహిళా సంఘాల సభ్యులు వివిధ శాఖల సిబ్బంది ఈ వివాహాల వల్ల కలిగే అనర్థాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామ, వార్డు స్థాయిలో మహిళా పోలీసు, ఇతర సిబ్బంది బాధ్యతగా తీసుకోవాలని చెప్పారు. డీఎస్పీలు శివనారాయణస్వామి, సీతారామయ్య, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ అనుపమ, డీఎల్‌డీఓ నాగేశ్వరరావు, డివిజన్‌లోని తహసీల్దార్‌లు, ఎంపీడీఓ, ఐసీడీఎస్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నిర్ణీత సమయంలో సమస్యల పరిష్కారం



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి

ఆదోనిటౌన్ : ప్రజల సమస్యలను నిర్ణీత సమయంలోనే పరిష్కరిస్తామని మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి తెలిపారు. గురువారం పట్టణంలోని 22వ వార్డు వైఎస్సార్‌నగర్ లోని వార్డు సచివాలయంలో వార్డు స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఎంఈ రాధాకృష్ణ, వివిధ సెక్షన్ల అధికారులు పాల్గొని స్థానికుల నుంచి సమస్యలపై వినతులు స్వీకరించారు. అయితే ప్రజల నుంచి వచ్చిన సమస్యలను కొన్నింటిని తక్షణమే పరిష్కరిస్తామని, ఆర్థిక ప్రయోజనాలతో కూడిన సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని కమిషనర్ చెప్పారు. కార్యక్రమంలో 41 మంది ఫిర్యాదులు చేశారు. ఆయా సెక్షన్ల వారీగా ఫిర్యాదులను పరిశీలించి పరిష్కరిస్తామని పేర్కొన్నారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ టిడ్కో ఇళ్లను పరిశీలించారు.

కోలుకోలేక వ్యక్తి మృతి



జీతు వీరేష్‌గౌడ్ (ఫైల్)

ఎమ్మిగనూరురూరల్: పట్టణానికి చెందిన జీతు వీరేష్ గౌడ్ (48) రోడ్డు ప్రమాదంలో గాయపడి కర్నూల్లోని ఓ ప్రైవేట్ హస్పిటల్లో చికిత్స పొందుతూ కోలుకోలేక గురువారం సాయంత్రం మృతి చెందాడు. వివరాలు.. పట్టణానికి చెందిన జీతు వీరేష్‌గౌడ్ గత నెల 25వ తేదీ రాత్రి కోసిగి రోడ్డులోని కల్లు డిపో నుంచి బైక్‌పై ఇంటికి వెళ్తూ వ్యవసాయ మార్కెట్ యార్డు రోడ్డు దాటుతుండగా మంత్రాలయం వైపు నుంచి వచ్చిన కర్ణాటక లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వీరేష్‌గౌడ్ తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స కోసం ప్రభుత్వాసుపత్రికి తరలించి అక్కడ నుంచి మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు తరలించారు. బ్రెయిన్‌లో రక్తం గడ్డకట్టడంతో ఓ ప్రైవేట్ హాస్పిటల్లో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. మృతుడికి భార్య శిరీష, ముగ్గురు కుమార్తెలు సంతానం ఉన్నారు. ఇంటి పెద్ద దిక్కు చనిపోవడంతో కుటుంబం శోక సముద్రంలో మునిగిపోయింది. ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

వ్యక్తిపై దాడి



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మాల శేఖర్

నందవరం: పొలంలో నిలిచిన వర్షపు నీరు కిందకు వెళ్లేందుకు సహకరించాలని కోరిన మాల శేఖర్ అనే వ్యక్తిపై దాడి జరిగింది. ఈ ఘటన మండల పరిధిలోని ఇబ్రహీంపురం గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ తిమ్మయ్య తెలిపిన వివరాలు.. గ్రామంలో మాల శేఖర్, బోయ బొజ్జన్న పొలాలు పక్కపక్కనే ఉన్నాయి. అయితే శేఖర్ పొలం పైన ఉండడంతో వర్షపు నీరు బొజ్జన్న పొలంలోకి పారుతుండేది. ఈ ఏడాది వర్షపు నీరు కిందకు పారకుండా బొజ్జప్ప కుమారులు బోయ రామాంజిని, ఉరుకుంద, నరసింహులు అడుకట్ట వేశారు. దీంతో ఈ రోజు గ్రామ పెద్దల వద్ద పంచాయతీకి పిలిచి వర్షపు నీరు కిందకు ప్రవహించాలని చెప్పిన మాల శేఖర్‌పై బోయ రామాంజిని, ఉరుకుంద, నరసింహులు, బొజ్జన్న దాడి చేసి గాయపరిచారు. కులం పేరుతో దుషించి తీవ్రంగా గాయ పరిచారు. ప్రస్తుతం మాల శేఖర్ ఎమ్మిగనూరు ఆసుపత్రికిలో చిక్సిత పొందుతున్నాడు. శేఖర్ ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

అడిగిన వారందరికీ ఉపాధి పనులు



మొలగవెల్లిలో ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఏపీడీ

ఆలూరు: వ్యవసాయ కూలీలకు ఉపాధి పనులు కల్పించడంలో సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తీప్పవని ఏపీడీ పక్కీరప్ప హెచ్చరించారు. ఆయన గురువారం ఆలూరు మండలంలోని మొలగవెల్లి, కురువెల్లి, పెద్దహోతూరు తదితర గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాధి పనులు కావాలని అడిగిన వారికి వెంటనే జాబ్‌కార్డులను మంజూరు చేసి పనులను కల్పించేంలా చర్యలు తీసుకోవాలని సీనియర్ మేట్లు, ఎఫ్ఏలు, టీసీ, ఈసీలను ఆదేశించారు. గ్రామాల్లోని ప్రజలు వలసలు వెళ్లకుండా ఉపాధి పనులు కల్పించాలన్నారు. ఉపాధి హామీ పథకం ఎఫ్ఏలు, సీనియర్లు మేట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు తదితరులు వెంట ఉన్నారు.

ఎల్లార్తి దర్గాల్లో భక్తిశ్రద్ధలతో ఫాతెహాలు

హొళగుంద: మండల పరిధిలోని ఎల్లార్తిలో వెలసిన శేక్షావలి, షాషావలి దర్గాల్లో గురువారం భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ఫాతెహాలు నిర్వహించారు. ఆయా ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్గాల్లో ప్రత్యేక ఫాతెహాలు నిర్వహించి మొక్కుబడులు తీర్చుకున్నారు. రాత్రి అక్కడే నిద్రించారు. అలాగే హొళగుంద సాయిబన్న, చిణిగితాత దర్గాల్లో, షిర్డీ సాయిబాబా ఆలయంలో భక్తులు మొక్కులు తీర్చుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ఆదోనిఅర్బన్ : మంత్రాలయం మండలం కల్లుకుంట గ్రామానికి చెందిన ఎర్రన్న గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాయ్యాడు. పెద్దతుంబళం పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఎర్రన్న కల్లుకుంట నుంచి ఆటోలో ప్రయాణిస్తుండగా పెద్దకడబూరు మండలం పులికనుమ గ్రామ సమీపంలో ఎదురుగా వస్తున్న కారు ఆటోను ఢీకొట్టడంతో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఆదోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు తీసుకెళ్లారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

జయప్రదం చేయండి

ఆదోనిరూరల్ : ఈనెల 15వ తేదీన ప్రజారక్షణభేరీ బహిరంగ సభను విజయవాడలో నిర్వహిస్తారని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు రాధాకృష్ణ, పట్టణ కార్యదర్శి లక్ష్మన్న పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని సుందరయ్య భవన్‌లో కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ చలో విజయవాడ కార్యక్రమానికి తరలి రావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

జగనన్నతోనే రాష్ట్ర భవిష్యత్తు



మాట్లాడుతున్న గుమ్మనూరు నారాయణస్వామి

ఆస్పరి: అందరూ కలసికట్టుగా పనిచేసి రాబోయే ఎన్నికల్లో జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకుందామని వైఎస్సార్‌సీపీ నాయకుడు గుమ్మనూరు నారాయణస్వామి పిలుపునిచ్చారు. గురువారం ఆస్పరిలో జేసీఎస్ మండల కన్వీనర్ బసవరాజు ఆధ్వర్యంలో ఆస్పరి మండల వైఎస్సార్‌సీపీ శ్రేణులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, కార్యకర్తలతో 'ఆంధ్రప్రదేశ్‌కు జగనన్నే ఎందుకు సీఎం కావాలి' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గుమ్మనూరు నారాయణస్వామి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేదల సంక్షేమం కోసం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి వారిని సామాజికంగా, ఆర్థికంగా ఆదుకున్నాడన్నారు. పాదయాత్రలో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చి ఆదర్శంగా నిలిచాడన్నారు. గృహసారథులు, సచివాలయం కన్వీనర్లు, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరిస్తూ ప్రజల్లో చైతన్యం నింపాలన్నారు. ప్రతి గ్రామంలో పార్టీ జెండా ఎగరవేసి పార్టీ నాయకులు పల్లెల్లో నిద్ర చేయాలన్నారు. గత టీడీపీ హయాంలో ప్రజలకు చేసిందేమి లేదన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి రాంభీంనాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు దొరబాబు, కేడీసీసీ బ్యాంకు జిల్లా డైరెక్టర్ మూలింటి రాఘవేంద్ర, మండల సొసైటి చైర్మన్ కట్టెల గోవర్ధన, ఆస్పరి, ఆలూరు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్లు పెద్దయ్య, వీరేష్, నాయకులు పురుషోత్తం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫ్యామిలీ ఫిజీషియన్‌తో మెరుగైన వైద్యం

ఆలూరు రూరల్: ఫ్యామిలీ ఫిజీషియన్ ద్వారా ప్రజలకు మెరుగైన వైద్యం అందుతోందని మొలగవల్లి పీహెచ్‌సీ డాక్టర్ శాంతి అన్నారు. గురువారం ఆలూరు–4 సచివాలయం పరిధిలో ఫ్యామిలీ ఫిజీషియన్ హెల్త్ క్యాంప్ నిర్వహించారు. వృద్ధులు, గర్భిణులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందించారు. వైద్యారోగ్య సిబ్బంది దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తుల ఇంటి వద్దకే వెళ్లి ఆరోగ్య పరీక్షలు చేశారు. ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు ఎప్పటికప్పుడు వారి పరిధిలో ఉన్న ఇళ్లకు వెళ్లి ప్రజల ఆరోగ్య పరిస్థితులను ప్రత్యేక యాప్‌లో నమోదు చేయాలని వైద్యులు సూచించారు. ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో 136 మందికి వైద్య పరీక్షలు చేసినట్లు డాక్టర్లు తెలిపారు.

మత్తుతో భవిష్యత్తు చిత్తు

తుగ్గలి: మత్తుకు బానిసగా మారి భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సీహెచ్‌ఓ అన్నపూర్ణ సూచించారు. టొబాకో, మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. మత్తు పదార్థాలకు బానిసైతే సర్వం కోల్పోతారన్నారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండి కష్టపడి చదివి ఉత్తమ పౌరులుగా ఎదగాలన్నారు.

ప్రజా సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం



మదిరెలో మహిళకు బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోనిరూరల్ : ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని మదిరె గ్రామంలో రెండోరోజూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని కొనసాగించారు. ఈఎమ్మెల్యే గ్రామంలో ప్రతి గడప తిరుగుతూ ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలో అన్ని సమస్యలను త్వరలో పరిష్కస్తామని చెప్పారు. ఎమ్మెల్సీ మధుసూదన్, వీరశైవలింగాయతీ స్టేట్ డైరెక్టర్ మంజుల, స్టేట్ పోలీస్ కార్పొరేషన్ డైరెక్టర్ రేణుక, ఎంపీడీఓ గీతావాణి, ఇన్‌చార్జ్ ఈఓపీఆర్డీ నాగరాజు, హౌసింగ్‌బోర్డు అధికారి తిక్కన్న, సర్పంచ్ నారాయణ, ఎంపీటీసీ మహాదేవి, మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ కామాక్షి తిమ్మప్ప, వైఎస్సార్సీపీ జిల్లా ఎగ్జిక్యూట్ మెంబర్ శ్రీలక్ష్మి, నాయకులు రామలింగేశ్వరయాదవ్, గోవర్ధన్‌రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, లక్ష్మికాంత్‌రెడ్డి, శీనప్ప, దేవేంద్ర, హనుమంతు, తిక్కన్న, అంజి, శంకర్, పరికల నారాయణ, గిడ్డయ్య, చిన్న ఈరన్న పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత



ఆలయ కమిటీ నిర్వాహకులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే సాయి

ఆదోనిటౌన్ : పట్టణంలోని కల్లుబావి వీధికి చెందిన పి.ఎస్.ఓబులేష్ రోడ్డు ప్రమాదంలో నాలుగు నెలల క్రితం గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు కార్పొరేట్ ఆస్పత్రిలో వైద్యం చేయించారు. ముఖ్యమంత్రి సహాయనిధి కింద ఓబులేష్‌కు రూ.1.50 లక్షలు మంజూరు కాగా, ఆ మొత్తాన్ని గురువారం ఎమ్మెల్యే తన స్వగృహంలో బాధితుడికి అందజేశారు.

రథం నిర్మాణానికి విరాళం

పట్టణంలోని కల్లుబావి వీధిలో వెలిసిన శ్రీ మణికోప ఆంజనేయస్వామి ఆలయానికి నూతనం రథం నిర్మాణానికి ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి గురువారం రూ.3,00,111 చెక్కును ఆలయ కమిటీ నిర్వాహకులకు అందజేశారు. కమిటీ నిర్వాహకులు, వైఎస్సార్‌సీపీ నాయకులు మాధవరెడ్డి, వీరభద్రారెడ్డి, మల్లికార్జునరెడ్డి, బోయశీను, మస్తాన్, నరసారెడ్డి, ఉసేన్, నాగరాజు, ముత్తు ప్రభాకర్‌రెడ్డికి ఎమ్మెల్యే చెక్కు అందించారు. దేవాలయాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే చెప్పారు.

ఉన్నత లక్ష్యంతో చదవాలి



విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందిస్తున్న ప్రొఫెసర్ రాజశేఖర్

ఆస్పరి: విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదవాలని ప్రొఫెసర్ రాజశేఖర్ సూచించారు. ఆస్పరికి చెందిన రాజశేఖర్ బెంగళూరులో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. ఆయన నాలుగేళ్లుగా మండలంలో చదువులో ప్రతిభ చాటుకున్న విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందిస్తున్నారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్లో 2021–22, 2022–23లో పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులకు ఆయన గురువారం తల్లిదండ్రులు దుర్గం ఈరమ్మ, కుమారప్ప జ్ఞాపకార్థం నగదు బహుమతులు అందజేశారు. పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన రేష్మకు రూ.5 వేలు, మల్లేశ్వరికి రూ.5 వేలు, కృష్ణ, రాము, యూనస్, వైష్ణవిలకు రూ.3 వేలు చొప్పున చెక్కులు, ప్రశంసా పత్రం, మొమెంటోలను అందజేశారు.

న్యాయవాదుల రిలే నిరాహార దీక్షలు



పత్తికొండలో రిలే నిరాహార దీక్షలు చేపట్టిన న్యాయవాదులు

పత్తికొండ రూరల్: ఏపీ బార్ కౌన్సిల్ అనాలోచితంగా పెంచిన రూ.20 వెల్ఫేర్ స్టాంపును తక్షణమే రద్దు చేయాలని కోరుతూ గురువారం పత్తికొండ న్యాయవాద బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక నాలుగు స్తంభాల కూడలిలో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. స్థానిక బార్ అసోసియేషన్ అధ్యక్షుడు క్రిష్ణయ్య అధ్యక్షతన జరిగిన దీక్షలనుద్దేశించి సీనియర్ న్యాయవాదులు ఎల్లారెడ్డి, మైరాముడు మాట్లాడారు. ఇప్పటికే రూ.100 వెల్ఫేర్ స్టాంపు ఉందని అదనంగా రూ.20 స్టాంపు తీసుకురావడం వల్ల కక్షిదారులపై అదనపు భారం పడుతుందన్నారు. వెంటనే పునరాలోచించి రూ.20 స్టాంపును రద్దు చేయాలని కోరారు. న్యాయవాదులు రంగస్వామి, సురేంద్రకుమార్, ప్రసాద్‌బాబు, సుధాక్రిష్ణ తదితరులు కూర్చున్నారు. సీనియర్ న్యాయవాదులు సురేష్‌కుమార్, చంద్రశేఖర్‌నాయుడు, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

చేతులు శుభ్రం చేసుకోవాలి



ఆస్పరి కేజీబీవీలో విద్యార్థినికి ఐరన్ మాత్రలు వేస్తున్న దృశ్యం

ఆస్పరి: భోజనం చేసే ముందు ప్రతి ఒక్కరూ చేతులు శుభ్రం చేసుకోవాలని ఆర్‌బీఎస్‌కే జిల్లా కో–ఆర్డినేటర్ హేమలత విద్యార్థినులకు సూచించారు. గురువారం స్థానిక ఆస్పరి కేజీబీవీలో నిర్వహిస్తున్న విఫ్స కార్యక్రమాన్ని ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె పాఠశాల విద్యార్థినులకు ఐరన్ మాత్రలు వేసి వాటి గురించి వివరించారు. ప్రతి ఒక్కరూ శుభ్రంగా ఉండాలని సూచించారు. డాక్టర్ రఘురామిరెడ్డి, సీహెచ్‌ఓ రాజేశ్ ఆచారి తదితరులు పాల్గొన్నారు.

సమస్యాత్మక గ్రామాలపై నిఘా

కృష్ణగిరి: మండలంలోని సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంచామని వెల్దుర్తి సీఐ సురేష్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని తొగర్చేడు గ్రామంలో గురువారం రాత్రి ఆయన కృష్ణగిరి ఎస్ఐ సురేష్‌తో కలిసి పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఫ్యాక్షన్ గ్రామాల్లోని ప్రజల్లో మార్పు తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. శాంతి భద్రతలు కాపాడేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. సమస్యలు వచ్చినప్పుడు నిర్భయంగా వచ్చి స్టేషన్‌లో చెప్పుకోవచ్చన్నారు. ఫ్యాక్షన్ వల్ల కలిగే అనర్థాలను వివరించారు.